క్లుప్తంగా

స్పందనను వినియోగించుకోండి

పటమట(విజయవాడతూర్పు): నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవడానికి స్పందన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూం, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యాన స్పందన జరుగుతుందని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగరవాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలని సూచించారు.

రేపు మాంసం విక్రయాలు బంద్

పటమట(విజయవాడతూర్పు): మహావీర్ జయంతి సందర్భంగా ఈ నెల 4వ తేదీన నగరంలో మాంసం విక్రయాలను బంద్ చేస్తున్నామని, నగరంలోని కబేళా కూడా మూసేస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం నగరంలోని అన్ని చికెన్, మటన్ దుకాణాలు, చేపల మార్కెట్లకు సెలవు ప్రకటించామని, నిబంధనలను పాటించకుండా షాపులు తీస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన నూకాలమ్మ జాతర



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సొరంగం సమీపంలో జరుగుతున్న నూకాలమ్మ జాతర ఆదివారం ముగిసింది. గత నెల 21వ తేదీ నుంచి ఉత్సవాలు మొదలయ్యాయి. ఆదివారం ఉదయం అమ్మవారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారి సంబరం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధికి ఊరేగింపుగా వెళ్లింది. మధ్యాహ్నం 12 గంటలకు నూకాలమ్మ గుడిలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. కులమతాలకతీతంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

5న పాతశివాలయంలో అయ్యప్ప జయంతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లోని అయ్యప్పస్వామి సన్నిధిలో ఈ నెల ఐదో తేదీన అయ్యప్ప స్వామి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు కె.మురళీధరన్ నంబూద్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తేదీ శుక్రవారం ఉదయం 108 హోమ గుండాలు, 108 మంది దంపతులతో ప్రత్యేక హోమాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మీగణపతి, సుదర్శన హోమం, నవగ్రహ, రుద్ర, ఆదిత్యాది హోమాలు నిర్వహిస్తామని తెలిపారు. హోమాల్లో పాల్గొనాలనుకునే దంపతులు ఆలయ ప్రాంగణంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రజా జీవనానికి ఆటంకం కలిగించొద్దు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రజా జీవనానికి ఆటంకం కలిగించొద్దని సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. కొత్తపేట పీఎస్ పరిధిలోని టేనర్‌పేట అడ్డరోడ్డు, కేఎల్‌రావునగర్, వీఎంసీ కాలనీ, పాలప్రాజెక్టు, పంజా సెంటర్, నైజాం గేటు, కోమల విలాస్, సుబ్రహ్మణ్యస్వామి గుడి అడ్డరోడ్డు ప్రాంతాల్లో ఆదివారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యాన ఆయా సెక్టార్ ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుల్స్ ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ రోడ్లపై నిలిపిన ఆటోలు, బైక్‌లపై ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తూ తిరుగుతున్న యువకులను స్టేషన్‌కు తరలించారు. వారికి సీఐ సుబ్రహ్మణ్యం కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్లపై జులాయిగా తిరిగితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. యువకుల తల్లిదండ్రులను పిలిచి హెచ్చరించి పంపేశారు.

ఠాగూర్ గ్రంథాలయంలో కూచిపూడి నాట్య శిక్షణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కూచిపూడి నాట్య శిక్షణ కార్యక్రమాన్ని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ ప్రారంభించారు. నటరాజ విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ప్రతి ఆదివారం ఉచితంగా కూచిపూడి నాట్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నృత్యంలో అపార అనుభవమున్న బి.హెచ్.ఎస్. వి.కె.శర్మ శిక్షణ ఇస్తారన్నారు. సరస్వతి సామ్రాజ్యం సంస్థ ఆధ్వర్యంలో సునీత విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు నేర్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది కె.రాంబాబు, జె.శంకర్, గోపాలరావు, ఫణి బాబు, దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో విజయం

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- భయం వీడి ధైర్యంతో పరీక్ష రాయాలి
- ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలంటున్న నిపుణులు



పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పట్టుదలతో ముందుకు సాగితే విజయం తథ్యమని నిపుణులు అంటున్నారు. పదో తరగతి పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉన్నత విద్యాభ్యాసానికి పది పరీక్షలు కీలకం. సాధారణంగా ప్రతి విద్యార్థితో పాటుగా వారి తల్లిదండ్రుల్లోనూ ఆందోళన ఉంటుంది. విద్యార్థులు భయాన్ని వీడి ధైర్యంతో ముందుకు సాగితే ఏడాది పడిన కష్టానికి ఫలితముంటుంది. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయం వరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలి. ఈ ఏడాది ఆరు పరీక్షల విధానాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. మార్పులకు అనుగుణంగా విద్యార్థులు అవగాహనతో పరీక్షకు హాజరై విజయం సాధించాలి.

ప్రశ్నపత్రం తీసుకున్న వెంటనే...

విద్యార్థులు ప్రశ్నపత్రం తీసుకున్న వెంటనే హాల్‌టికెట్ నెంబర్ రాయాలి. ప్రశ్నపత్రాన్ని సమగ్రంగా చదువుకొని పరీక్షను ప్రారంభించాలి. తొలిగా ఎంచుకునే ప్రశ్నలు జాగ్రత్తగా రాసి మంచి అభిప్రాయాన్ని పొందే విధంగా ఉండాలి. ప్రశ్నపత్రంలో జవాబులు రాని వాటిని ఆలోచించి నిరుత్సాహ పడకుండా ఉండాలి.

24 పేజీల బుక్‌లెట్..

ప్రశ్నలకు జవాబులు రాసేందుకు 24 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తారు. అది నిండిపోతే అదనంగా మరో 12 పేజీల బుక్‌లెట్ అందజేస్తారు. ఓఎమ్మార్ షీట్‌లో విద్యార్థి వివరాలన్నీ ఉంటాయి. దానిలో లోపాలుంటే వెంటనే ఇన్విజిలేటర్‌కు తెలియజేయాలి. దానిపై ఏమి రాయకుండా ఉండాలి.

అరగంట ముందుగా చేరుకోవాలి

పరీక్షా కేంద్రానికి విద్యార్థులు కనీసం అరగంట ముందుగా చేరుకోవాలి. తొమ్మిది గంటలకల్లా పరీక్షా కేంద్రంలోకి వెళ్లాలి. మానసిక ఒత్తిడి లేకుండా ఉండాలి. హాల్‌టికెట్, పెన్నులు ఇతర పరీక్ష సామగ్రిని చూసుకొని కేంద్రానికి చేరుకోవాలి. మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలి.

జాగ్రత్తలు అవసరం



పరీక్ష రాసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. అక్షరాలు మరీ చిన్నవిగా, పెద్దవిగానూ కాకుండా స్పష్టంగా అర్థమయ్యేలా రాయాలి. జవాబు పత్రంలో కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి. పాయింట్ల వారీగా రాస్తే మంచి మార్కులు సాధించడానికి అవకాశముంటుంది.

–కె.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, హిందూహైస్కూల్

అన్ని ఏర్పాట్లు చేశాం

పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ప్రతి కేంద్రంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు చేపట్టాం. ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది నియామకానికి సంబంధించి అధికారుల ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకున్నాం.

– కొండా రవికుమార్, డీవైఈవో

ఘనంగా మట్టల ఆదివారం



సీఎస్‌ఐ క్రీస్తు దేవాలయం నుంచి ప్రదర్శన



షాలేము మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యాన..



బాలఏసు పుణ్యక్షేత్రం నుంచి..

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచంలో శాంతి, సమాధానాన్ని స్థాపించడానికి ఏసయ్య అవతరించాడని సీఎస్‌ఐ క్రీస్తు దేవాలయం పాస్టర్ రెవరెండ్ డాక్టర్ రేమల్లి ఆనందరావు పేర్కొన్నారు. మట్టల ఆదివారం పురస్కరించుకుని విద్యాధరపురంలోని సీఎస్‌ఐ క్రీస్తు దేవాలయం నుంచి మట్టలతో వివిధ వేషధారణల్లో బాలబాలికలు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. దేవాలయం నుంచి కుమ్మరిపాలెం సెంటర్ వరకు వెళ్లి తిరిగి దేవాలయం వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, సంఘ కాపరి/సెక్రటరీ కర్రి రాజు, కోశాధికారి ఈటె జాన్ విల్సన్, ఎద్దు సురేష్, వినోద్ పాల్, సండే స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


- విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధిలోని షాలేము మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టల ఆదివారం ర్యాలీ ఘనంగా జరిగింది. కుమ్మరిపాలెం సెంటర్, రావి చెట్టు సెంటర్, పున్నమి ఘాట్, నాలుగు స్తంభాల సెంటర్‌కు చేరుకుని తిరిగి షాలేము చర్చి వద్దకు వచ్చి దేవుని స్తుతించారు. చర్చి పాస్టర్ రెవరెండ్ పుట్ల సత్యవేదం, క్షమాబాయి, పెద్దలు కోటా రవికుమార్, దిబ్బ మణిబాబు, చింతపల్లి జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.
- మ్రాని కొమ్మల (మట్టల)ఆదివారం సందర్భంగా స్థానిక జోజినగర్‌లోగల అద్భుత బాల ఏసు పుణ్యక్షేత్రం నుంచి ఊర్మిళానగర్, ఏకలవ్యనగర్ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ మెరుగుమాల చెన్నప్ప, సహాయక గురువులు ఫాదర్ బాల శౌరి, టిన్షన్ సన్ సిస్టర్స్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాధరపురం(విజయవాడపశ్చిమ): ఫైజర్‌పేటలోని తెలుగుబాప్టిస్ట్ చర్చి సండేస్కూల్ ఆధ్వర్యంలో పవిత్ర 'మట్టల ఆదివారం' పండుగను క్రైస్తవ విశ్వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెలుగు బాప్టిస్ట్ చర్చి సంఘకాపరి నిక్సన్ ఆంద్రుస్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి కేలా వందనం, సండే స్కూల్ సూపరింటెండెంట్ ఆళ్లముడి సంపత్‌బేబి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెజ్జోనిపేటలో..

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. పెజ్జోనిపేటలోని సీఎస్‌ఐ చర్చి, ఆర్సీఎం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాలబాలికలు ఈత చెట్ల మట్టలకు పలు రకాల పూలను అలంకరించి వీధుల్లో ప్రదర్శనగా వెళ్లారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్‌లు, స్థానిక సంఘ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముని శేషవాహనోత్సవం



శేషవాహనంపై కొలువుదీరిన కోదండరాముడు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కన్యకాపరమేశ్వరి శ్రీరామ శ్రీనగరేశ్వర స్వామి దేవస్థానం (కొత్తగుళ్లు) ప్రాంగణంలోని శ్రీ కోదండరామ స్వామి వారు ఆదివారం శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో జరుగుతున్న కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం స్వామి వారి సన్నిధిలో దర్బార్ సేవ చేశారు. సాయంత్రం స్వామి వారికి విశేష ఉత్సవాలు జరిగాయి. ఆలయంలో భజన కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని మూలవిరాట్‌లకు కూడా విశేష అర్చనలు జరిగాయి. ఆలయంలో వైదిక కార్యక్రమాలను అర్చకులు పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు నిర్వహించారు. కమిటీ ప్రముఖులు పర్యవేక్షించారు.

'చట్టసభల్లో గోదావరి గళం' పుస్తకావిష్కరణ



రచయితను అభినందిస్తున్న శ్రీనివాస్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన రాజమండ్రికి చెందిన శ్రీపాద శ్రీనివాస్ రచించిన 'చట్టసభల్లో గోదావరి గళం' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్, ఎంఎల్ఎస్ ప్రసాద్ బాబు, అసోసియేషన్ కార్యదర్శి నరసరాజు, గుండు జనార్దన్, యర్రంశెట్టి శ్రీనివాసరావు, రాము చిదంబరం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత శ్రీపాద శ్రీనివాస్‌కు చిరు సత్కారం చేసి అభినందించారు.

భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, సర్వ మానవాళికి మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ జరిగింది.

రాముని పవళింపు సేవ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా కొత్తపేట రామాలయం సమీపంలోని నగరాల సీతారామస్వామి దేవస్థానంలో స్వామి వారికి ద్వాదశి ప్రదక్షిణలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా శ్రీ నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కమిటీ ఆధ్వర్యాన వేలాది మందికి అన్నప్రసాద వితరణ చేశారు. దేవస్థానం పాలక మండలి అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు తదితరులు శ్రీ సీతారాములకు పూజలు చేసి అనంతరం అన్నదానం జరిగింది. దేవాలయం ప్రాంగణంలోని అద్దాల మండపంలో వివిధ రకాల పూలతో అలంకరించిన ఉయ్యాలలో స్వామివారి పవళింపు సేవ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రముఖులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

- అక్కచెల్లెమ్మల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి
- పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న వెలంపల్లి, భాగ్యలక్ష్మి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు జేజేలు పలుకుతున్నారని, మహిళా సాధికారతే లక్ష్యమని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. నాడు ప్రతిపక్ష నేతగా 3,648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రలో స్వయం సంఘాల్లో ఉన్న అక్కచెల్లెమ్మల కష్టాలను కళ్లారా చూసి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతలుగా పొదుపు సంఘాల ఖాతాల్లో జమ చేస్తానని జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చారన్నారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా మూడవ విడత సంబరాలు ఆదివారం విద్యాధరపురం కబేళా రోడ్డులోని జేఎన్ఎన్‌యుఆర్ఎం గృహ సముదాయంలో నిర్వహించారు. ఇందులో 42, 43, 44, 45 డివిజన్ల పరిధిలోని 502 స్వయం సహాయక సంఘాల్లో 5002 మంది డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రూ. 3,56,33,174 నమూనా చెక్కును ఆయన, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బ్యాంకుల రుణాలను కట్టవద్దని పిలుపునిచ్చి తర్వాత వారిని మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అన్నారు. అతని హామీని నమ్మి రుణాలు చెల్లించక చివరికి వడ్డీకూడా కట్టలేక దయనీయమైన పరిస్థితుల్లోకి నెట్టబడ్డారన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత విడతల వారీగా చెల్లిస్తున్నారన్నారు.

టచ్‌లో ఉంటే 175 సీట్లకు పోటీ చెయ్యమనండి

కొంతమంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని ప్రజలను మభ్యపెట్టకపోతే, నిజంగా టచ్‌లో ఉంటే 175 నియోజకవర్గాల్లో పోటీ చెయ్యాలని వెలంపల్లి.. చంద్రబాబుకు సవాల్ విసిరారు. సింగిల్‌గా పోటీ చేసే దమ్ము చంద్రబాబు, ఆయన కొడుకు లోకేష్, దత్త పుత్రుడికి ఉంటే సీఎం జగన్‌కు పోటీ నేనే అని చెప్పమనండి అంటూ మండిపడ్డారు. పవన్ కల్యాణ్ వారాహి వాహనం ఉందా..అమ్మేశాడా అన్న అనుమానం వ్యక్తం చేశారు. ఉంటే దానిలో ఎందుకు తిరగటం లేదని ప్రశ్నించారు. అంతే కాకుండా 2016లో రద్దైన సున్నా వడ్డీ పథకాన్ని పునరుద్ధరించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పడిగపాటి చైతన్యరెడ్డి, బాపతి కోటిరెడ్డి, మైలవరపు రత్నకుమారి, మైలవరపు మాధురి లావణ్య, పార్టీ నాయకులు మైలవరపు సోదరులు కృష్ణ, దుర్గారావు, కంది శ్రీనివాసరెడ్డి, మాదల తిరుపతిరావు, వల్లం రవికుమార్, ముత్తా వాసు, కోటేశ్వరరావు, బోర మల్లేశ్వరరెడ్డి, నల్లం వాసు, దావాల బుజ్జి, సుంకర నారాయణ, గొంది శాంతి, పద్మారెడ్డి, దావాల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొద్ది రోజుల్లో స్టేడియం సిద్ధం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



వైఎస్సార్ పార్క్‌లో ఆట వస్తువులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యాధరపురంలో నిర్మించనున్న స్టేడియాన్ని అతి కొద్ది రోజుల్లోనే సిద్ధం చేయనున్నట్లు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ప్రకటించారు. ఆదివారం భవానీపురం 42వ డివిజన్ పరిధిలోని ట్రాంబే రోడ్డులో ఉన్న వైఎస్సార్ పార్క్‌లో డివిజన్ ఫ్రెండ్స్ వాకర్స్‌తో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు గెట్ టు గెదర్ నిర్వహించారు. వాకర్స్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓపెన్ పార్క్‌లో కాసేపు జిమ్ చేశారు. మేయర్‌తో కలిసి షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. సభ్యులతో కలిసి వాకింగ్ చేశారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన ఆట వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం స్టేడియం కాంపౌండ్ వాల్ నిర్మాణం జరుగుతోందన్నారు. మట్టి చదును చేసి నెల రోజుల్లో చిన్నారులకు స్టేడియాన్ని గిఫ్ట్‌గా ఇస్తామన్నారు. రూ. 7 కోట్ల వ్యయ అంచనాతో మొదటి విడత ఇండోర్ షటిల్ కోర్టు, వాలీబాల్, ఫుట్‌బాల్ కోర్టులను దశలవారీగా సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. స్టేడియంతోపాటు ఎంజీ స్టేడియం మాదిరి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని అంచనా వేసినట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో ఏ రోడ్డు చూసినా బందరు రోడ్డుకు దీటుగా తయారవుతున్నాయన్నారు. 42వ డివిజన్‌లో పార్క్ ప్రారంభ సమయంలో వైఎస్సార్ పార్క్‌గా నామకరణం చేశామన్నారు. ఇకపై ప్రతినెలా విధిగా పార్క్‌ను సందర్శిస్తానన్నారు. పార్క్ మెయిన్ గేటు ఎదురుగా ట్రాఫిక్ క్లియర్ చేయించాలని, అక్కడ ఉన్న అడ్డంకులు తొలగించాలని సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, స్థానిక కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి, వక్కలగడ్డ శ్రీకాంత్, కేసరి కృష్ణారెడ్డి, లంకిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి గోటి తలంబ్రాలు



ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఈ నెల 5న నిర్వహించే సీతారాముల కల్యాణానికి విజయవాడ కృష్ణలంకకు చెందిన భక్తవత్సల సేవా సమితి ప్రతినిధి ధనలక్ష్మి ఆధ్వర్యంలో సుమారు 40 కేజీల గోటి తలంబ్రాలను ఆలయ టీటీడీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయుడుకి అందజేశారు. రామయ్యపై భక్తి భావంతో వడ్లను గోటితో వలిచినట్లు వారు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేత పుల్లయ్య మృతికి సంతాపం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గుత్తికొండ పుల్లయ్య మృతికి ఎమ్మెల్సీ రుహుల్లా, కార్పొరేటర్లు సంతాపం తెలిపారు. 42వ డివిజన్ 125వ సచివాలయం కన్వీనర్ గుత్తికొండ పుల్లయ్య (50) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ఆయన పార్టీలో పని చేస్తున్నారు. కుటుంబ సభ్యులకు నేతలు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అన్నదానానికి మించింది ఏదీ లేదు



ఊర్మిళానగర్‌లో అన్నదానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): దానాల్లో అన్నదానానికి మించింది మరొకటి లేదని, నలుగురికి పట్టెడన్నం పెడితే దేవుడు మేలు చేస్తాడని చండూరు వెంకటరెడ్డి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎ.శరాబందిరావు పేర్కొన్నారు. స్థానిక ఊర్మిళానగర్ పరిధిలోని సంస్కృతి ఫంక్షన్ హాల్ వద్ద ఆదివారం ప్రారంభమైన మీనాక్షి డోర్స్ సందర్భాన్ని పురస్కరించుకుని షాపు యజమాని ఎస్‌వీఎస్ కృష్ణారావు అన్నదానం చేశబూరు. శరాబందిరావు మాట్లాడుతూ జిల్లా కేబినెట్ నాయకులు ఎంఎస్ ఇమామ్ బాషా క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ జాయింట్ సెక్రటరీ పీవీ హనుమంతరావు, క్లబ్ నాయకులు వెంకట నారాయణ, నాగరాజు, శ్రీనివాసరావు, పింగళి వెంకట రమణ, రూపనాథ్ తదితరులు పాల్గొన్నారు.

6న గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకుని 6వ తేదీ ఉదయం ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. గురువారం ఉదయం 6 గంటలకు మహా మండపం నుంచి ప్రారంభమయ్యే గిరి ప్రదక్షిణలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులు ప్రచార రథంపై కొలువుదీరన్నారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ సాగే గిరి ప్రదక్షిణలో దేవస్థాన చైర్మన్, ఈవోతో పాటు పాలక మండలి సభ్యులు, అర్చకులు, ఆలయ అధికారులు, ఆలయ ఉద్యోగులు కుటుంబ సమేతంగా పాల్గొననున్నారు.



వచ్చాను




వాలాను

మధురం.. 'చిలక'ఫలం

మావిచిగురుచాటున మామిడి కాయలను చూసిన ఓ చక్కని చిలక పలుకులతో ఆ చెట్టుపై వాలిన చిత్రాలను చూడండి. పటమటలో ఓ ఇంటి సమీపంలోని మామిడి చెట్టుపై కాయలు అధిక సంఖ్యలో ఉన్నాయి. వాటిలో కొన్ని కాయలు పండటంతో అక్కడకు చేరిన చిలక మధురఫలాలను కొరుకుతున్న దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కొరికాను



వెళ్తున్నాను